# లోకం వేసిన ముద్ర

— మాడుగుల రామకృష్ణ

అమ్మ లేనివారు శాపగ్రస్తులు. అమ్మ అనురాగాన్ని పొందలేని అభాగ్యులలో తనూ ఒకడు. అతనికి గతం కళ్ళ ముందు నిలిచింది. ఆ రోజు తనకింకా బాగా గుర్తుంది. తనకప్పుడు పదేళ్ళు. స్కూలునుంచి ఇంటికి వచ్చి పుస్తకాలు అలమారులో పడేసి బయటకు పరుగు దీయబోయాడు. ఇంతలో పక్కింటి సీతమ్మగారు తనను పిలిచి "బాబూ! ప్రకాశం నీకు తమ్ముడో, చెల్లెలో పుడతాడు. మీ అమ్మను ఆస్పత్రికి తీసుకెళ్ళారు మనం కూడా వెళదాంపద" అంటూ తనను తీసుకెళ్ళింది.

ఆస్పత్రిలో మంచంపై అమ్మ మెలికలు తిరుగుతూ బాధ పడుతోంది. నాన్నగారు బిక్కు బిక్కు మంటూ ఒక మూల నిలబడి వున్నారు అమ్మ కళ్ళతోనే తనను ప్రేమగా చూసింది. చీకటి పడిన తరువాత సీతమ్మగారు తనను ఇంటికి తీసుకెళ్ళింది. తను అన్నంతిని పడుకున్నాడు. కాని అర్థరాత్రి వేళ.... తనకు మెలకువ వచ్చి లేచాడు. సీతమ్మగారు తనను కౌగలించుకుని ఏడ్చింది. తనకేమి అర్థంకాలేదు. ఎందుకేడుస్తున్నావని అడిగితే "బాబూ, ప్రకాశం! మీ అమ్మ ఇకలేదు. నిన్ను విడిచి శాశ్వతంగా వెళ్ళిపోయింది." అంటూ బావురు మంది. "అమ్మా!" అంటూ తను అలాగే ఏడుస్తూ కూర్చున్నాడు. సీతమ్మగారు తనను ఓదార్చింది.

రెండు రోజులకు తన తండ్రి తన బామ్మను తీసుకొచ్చాడు. బామ్మ ఎప్పుడూ సణుగుతూ ఉండేది. ఒక రోజు తనతో "ఒరే ప్రకాశం! నీకు మరో అమ్మ వస్తోంది, కాని చాలా చెడ్డది. నిన్ను కొడుతుంది. ఆవిడతో ఎక్కువ మాట్లాడకు. తెల్సిందా" అన్నది.

"నిజంగా కొడుతుందా మామ్మా!" తను రెట్టించాడు.

"నిజంగానేరా! అయినా నేనున్నానుగా. నిన్ను కొట్టకుండా చూస్తాన్లే నీకేం భయం లేదులే" అంది బామ్మ.

కొన్ని రోజులకి నాన్న ఒకావిడను ఇంటికి తీసుకొచ్చాడు. తనకు భయం వేసి బామ్మ వెనగ్గా దాక్కున్నాడు ఆవిడ్ని పిన్ని అని పిలవమని బామ్మ చెప్పింది. ఎన్నో సార్లు పిన్ని తనను పలకరించేది. కాని తను తప్పించుకొని, అడిగినదానికే సమాధానం చెప్పేవాడు.

అతని ఆలోచనలకు అంతరాయంగా "బాబూ ప్రకాశం!" అన్న పిలుపు వినిపించింది. కాని ప్రకాశం మళ్ళీ ఆలోచనల్లో పడిపోయాడు. ఒక్కొక్కసారి పిన్ని తనను ప్రేమగానే చూసేది. అదంతా ఒట్టి నటన అని బామ్మ చెప్పింది. అందుకే తను ముభావంగా ఉండేవాడు.

"నిన్నే బాబూ! విన్పించలేదా? కాలేజీ టైమయ్యింది భోజనానికి రా!" అంటూ జానకమ్మ ప్రవేశించింది.

"వస్తుంటే ఎందుకలా గొంతు చించుకుని అరుస్తావ్? నాకేం చెవుడు లేదు." వీలైనంత కరుగ్గా అన్నాడు.

జానకమ్మ మనస్సు కలుక్కు మంది.

అన్నం దగ్గర కూర్చున్నాడన్న మాటే

గాని అతని ఆలోచనలు ఎక్కడో తిరుగుతున్నాయి. నెమ్మదిగా అన్నం కెలుకుతున్నాడు.

"అన్నం తిను బాబూ!" ప్రేమగా అన్నది జానకమ్మ. ఆమె వంక కోపంగా చూసి గబగబా రెండు ముద్దలు తిని అన్నంలోనే చెయ్యి కడిగేశాడు.

"అదేమిటిరా! అన్నం తినకుండానే చెయ్యి కడిగేశావ్?" కంగారుగా ప్రశ్నించింది జానకమ్మ.

"నా కాకలి లేదు." విసురుగా లేచి పోయి, బట్టలు వేసుకొని కాలేజీకి బయలుదేరాడు.

అలాగే గోడకి చేరగిలబడి ఆలోచిస్తోంది జానకమ్మ. ఆ కుటుంబంలో మొదటి సంతానంగా పుట్టిన తనకి తండ్రి చెయ్యలేక చెయ్యలేక ఎలాగో ఒంటో పెళ్ళి సంబంధం చేసి అయిందనిపించుకొని శ్వాస పీల్చాడు. కాపురంలో ప్రవేశించిన దగ్గరనుంచి తన కష్టాలు ప్రారంభమయ్యాయి. అత్తగారి సూటి పోటి మాటలు, సవతితల్లి దగ్గర పెరిగిన భావం ప్రకాశం మాటలలోను ధ్వనించేది. ప్రకాశాన్ని స్వంతబిడ్డలాగా ప్రేమగా చూడాలనుకున్న ఆమెకు ఎదురైంది. మొదట నవ్వుకొనుకున్న అమ్మ ఎక్కడున్నా తనను గౌరవించాలి, సవతితల్లిని అన్న బాధను లేకుండా తనను ఒక హృదయముంటే పాషాణంగా చూస్తున్న ప్రకాశం మాటలకు, ఆమె హృదయం బాధపడేది. కాని సవతితల్లి ఒక స్త్రీయేను, ఆమెకు ప్రేమ, ఆదరణ ఉంటుందన్న విషయం మరచి తన లోకం ఒక శాశ్వతమైన అశాంతి ఆపాదించింది. చెరిగిపోని ముద్ర వేసింది. ఇది సవతి తల్లులు చేసుకున్న పాపం. ఆవేదనతో ఆమె హృదయం ఘోషించింది.

* * *

రోజులు భారంగా గడిచిపోతున్నాయి. కాని ప్రకాశం ప్రవర్తనలో మాత్రం మార్పు లేదు. అతను ఈ విధంగా ఎందుకు ఎందుకు అలా ప్రవర్తిస్తున్నాడో జానకమ్మకు అర్థం కాలేదు. రాత్రి పది గంటలైంది. ఇంత వేళయినా ఇంకా ప్రకాశం ఇంటికి రాలేదు. ఎక్కడికి వెళ్ళాడో? తలుపు వేసి మంచం మీద పడుకుంది జానకమ్మ.

"అబ్బాయి ఇంకా రాలేదా జానకీ?" ఆవలిస్తూ అన్నాడు రామనాథం ఒత్తిగిలి పడుకుంటూ. "ఇంకా రాలేదండీ! ఆ.... అన్నట్లు ఇవాళ కాలేజీలో ఏదో మీటింగని చెప్పాడు. ఇంతవరకు మీటింగు ఉంటుందా? ఒకవేళ సినిమాకేమైనా వెళ్ళాడేమో!"

"రామనాథంగారు! రామనాథంగారు!" తలుపు దబదబా బాదుతున్న శబ్దానికి ఉలిక్కిపడి లేచి కూర్చుంది. జానకమ్మ

ఎవరు? కంగారుగా తలుపు తీసింది. ఎదురుగా ఉన్న దృశ్యానికి ఒక్కసారి భయకంపితురాలైంది. ఎదురుగా ప్రకాశం శరీరం నిండా రక్తం. తలమీదినుంచి రక్తం ధారగా కారుతోంది. ప్రకాశం స్నేహితులు అతన్ని పట్టుకొని క్రిందికి దింపుతున్నారు.

"ఏం జరిగింది బాబూ?" అప్పుడే లేచి వచ్చిన రామనాథం గొంతు తొట్రుపడింది.

"ఏం జరిగింది మోహన్? ఏమిటీ రక్తం?" జానకమ్మ వణికిపోతూ ప్రశ్నించింది.

"అన్నీ తరువాత చెబుతాను. ముందు ప్రకాశాన్ని లోపలకు చేర్చండి. నేను వెళ్ళి పక్కవీధిలోని డాక్టరును పిలుచుకొస్తాను." అంటూ మోహన్ బయటకు పరుగెత్తాడు. పది నిముషాల్లో డాక్టరును తీసుకొచ్చాడు. డాక్టరు తన పరీక్షలో మునిగిపోయాడు.

"ఎలా వుంది. డాక్టరుగారూ?" రామనాథం ఆతురతగా ప్రశ్నించాడు.

"ఈ కేసు చూస్తుంటే సీరియస్‌గా ఉంది. బ్లడ్ చాలా పోయింది. వెంటనే హాస్పిటల్లో చేర్పిస్తే మంచిది. క్విక్!" అంటూ డాక్టరు రామనాథాన్ని తొందర

రించాడు

మోహన్ వెంటనే రిక్షాలో ప్రకాశాన్ని ఎక్కించి హాస్పిటల్ వైపు దారితీశాడు.

ఇంతకూ ఏం జరిగింది బాబూ! జానకమ్మ ప్రకాశం స్నేహితుల్ని ప్రశ్నించింది

ఈరోజు కాలేజ్ "డే" అండీ! ప్రోగ్రామ్ లన్నీ అయ్యాక మేమందరం కలిసి వస్తున్నాము కాని ఇంతలో చీకటి సందులోంచి నలుగురైదుగురు రౌడీలు దారికాసి మామీదకు దూకారు. అందరం తప్పించుకున్నా ఒంటరిగా మిగిలిన ప్రకాశంపై దౌర్జన్యం జరిపారు. దీనికి కారణం కాలేజి ఛెయిర్మన్ పోటీలో గెలిచిన మూర్తికి మన ప్రకాశం కుడిభుజం. అతను గెలవటానికి ప్రకాశమే కారణం. ఓడిపోయిన సాంబశివం కక్ష లోపల దాచుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మనం కూడా హాస్పిటల్‌కు వెళదాం పదండి" అంటూ ముందుకు దారి తీశాడు

హాస్పిటల్‌లో ప్రకాశం స్పృహలేని స్థితిలో ఉన్నాడు. అతని చుట్టూ డాక్టర్లు తిరుగుతున్నారు.

కాస్సేపాగిన తరువాత "ఎలావుంది డాక్టర్?" అంటూ రామనాథం డాక్టరును ప్రశ్నించాడు.

చాలా సీరియస్‌గావుంది. తలకు పెద్ద గాయమయ్యి చాలా రక్తం పోయింది. అదీ గాక 'స్కల్ బోన్' దెబ్బ తిన్నట్లుంది. వెంటనే ఎక్స్‌రే తీసి చూసి అవసరమైతే ఆపరేషన్ చేయాలి.

రామనాథం గుండె చెరువైంది. పుట్టిన తరువాత ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి నెరుగలేదు. వాడికేదన్నా జరిగితే...



ఆ పై ఊహించలేకపోయాడు.

ఇంటికిచేరి జానకమ్మకి వార్త అందించగానే ఆమెకూడా కంపితురాలైంది. ఆమె హృదయం ఒక్కసారి ద్రవించింది.

"జానకీ! వీలైతే ఆపరేషన్ కూడా చెయ్యాలట. నాదగ్గర డబ్బు కూడా ఏమీలేదు ప్రస్తుతం. కనీసం రెండు వందలైనా వుండాలి ఇప్పుడు. ఏం చెయ్యాలి?" అటూ ఇటూ పచార్లు చేయసాగాడు.

"ఏమండీ! ఎంత ఖర్చయినా సరే భరించి ముందు బాబును బ్రతికించండి. డబ్బుకు వెనకాడ వద్దు. ముందు నా గాజులు, మంగళసూత్రం తాకట్టు పెట్టండి తీసుకోండి. సందేహించవద్దు" అంటూ తీసి అతని చేతిలో పెట్టింది.

"జానకీ!" రామనాథంగారి కళ్ళు చెమర్చాయి. "ఎంత మంచిదానవు జానకీ! కన్నతల్లిని కాకపోయినా తల్లినే మరిపిస్తున్నావ్. వాడి క్షేమాన్ని ఆశించి, సర్వస్వం అర్పించగల నీలాటి మాతృ హృదయం మనసారా ఇచ్చిన డబ్బుతో వాడికి తప్పకుండా నయమవుతుంది. ఎప్పటికైనా వాడు నీ హృదయాన్ని అర్థం చేసుకుంటాడు. వస్తాను జానకీ!" అంటూ ఆర్ద్రనేత్రాలతో రామనాథం వెళ్ళిపోయాడు.

"భగవాన్! కన్నబిడ్డ కాకపోయినా, బాబును బ్రతికించి మళ్ళీ మనిషిని చెయ్యి. నిన్ను చేతులెత్తి ప్రార్థిస్తున్నాను." అంటూ చేతులు జోడించి దైవం ముందు అలాగే నిలబడింది.

* * *

ఆమె ప్రార్థన ఆలకించినట్లు, ఆమె కోరుకున్నట్లు ప్రకాశానికి ఆపరేషన్ సక్సెస్ అయింది. నెలరోజుల తరువాత ప్రకాశాన్ని ఇంటికి తీసుకొచ్చారు. జానకమ్మ ఆనందం వర్ణనాతీతం. అతన్ని మంచం దిగనివ్వకుండా కావలసినవన్నీ తనే స్వయంగా చేస్తోంది. క్రమంగా కోలుకున్నాడు ప్రకాశం. తను కన్నబిడ్డ కాకపోయినా తన కోసం ఆమె చేసిన త్యాగానికి అతని హృదయం కరగిపోయింది. ఇన్నాళ్ళ తన అవివేకానికి సిగ్గు వేసింది.

"బాబూ! పాలు తీసుకో!" జానకమ్మ ప్రకాశానికి పాలు అందించింది. ఆమె వంక చూస్తూ అలాగే ఉండిపోయాడు ప్రకాశం.

"పాలు త్రాగు బాబూ!" ఆమె మళ్ళీ పిలిచింది.

"అమ్మా!" ఆర్ద్రపూరితమైన అతని పిలుపుకు ఉలిక్కి పడింది. ఇది కలా? నిజమా? ఆమెలో ఆశ్చర్యం ముప్పిరిగొంది.

"నన్ను క్షమిస్తావా అమ్మా! ఇన్నాళ్ళూ నీ మనస్సు అర్థం చేసుకోక బాధ పెట్టినందుకు క్షమించమ్మా. నా కోసం, ఏ తల్లీ సాహసించని విధంగా మంగళసూత్రం కూడా తాకట్టు పెట్టిన నీ ఔదార్యాన్ని అర్థం చేసుకోక నిన్ను నొప్పించాను. నన్ను క్షమిస్తావా అమ్మా!" అతని కళ్ళు సజలపూరితాలయినాయి.

"తప్పు బాబూ! చల్లని నీ పిలుపు కోసమే ఇన్నాళ్ళూ ఎదురు చూశాను. ఇన్నాళ్ళకి నా కోర్కె ఫలించింది. నన్ను మొదటి నుంచి ద్వేషించడం నీ తప్పుకాదు బాబూ. నీ చుట్టూ ఉండే ప్రపంచం నీ మనసులో విషబీజం నాటింది. సవతి తల్లంటే కరుడు గట్టిన శిలగా చిత్రించింది. చెరగని ముద్ర వేసింది. ఇన్నాళ్ళకైనా నీ మనసు మారింది. అంతేచాలు బాబు." ఆమె కళ్ళు వర్షించాయి.

"అవును జానకీ! నీ లాంటి తల్లులు ఈ సంఘంలో పదిమంది ఉన్నా సవతి తల్లికి వచ్చే అపఖ్యాతి తొలగి పోతుంది. అటువంటి వారి జీవితాలు ఆనందమయమవుతాయి." అప్పుడే ప్రవేశించిన రామనాథం గారి గొంతు పలికింది.

జానకమ్మ ఆనందంతో వారి వంక చూస్తూ అలాగే ఉండిపోయింది.

*